
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 18 నవంబరు 2025





టెక్కలి రూరల్: ఎండలమల్లన్నను దర్శించుకుంటున్న భక్తులు

శివోహం

● కార్తీకమాస చివరి సోమవారం శివాలయాలకు పోటెత్తిన భక్తులు

అరసవల్లి/ టెక్కలి రూరల్, నవంబరు 17: కార్తీకమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. సోమవారం వేకువజాము నుంచే ఆలయాల్లో రద్దీ కనిపించింది. శివనామస్మరణ మార్మోగింది. శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వరాలయం, టెక్కలి మండలం రావివలస ఎండలమల్లన్న ఆలయం, జలుమూరు మండలం శ్రీముఖలింగేశ్వరాలయాలు తదితర శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. శివునికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, విశిష్ట అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగావళి నది తీరాన కార్తీక దీపాలు వెలిగించి.. విడిచిపెట్టారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.



శ్రీకాకుళంలో ఉమారుద్రకోటేశ్వరుడికి అభిషేకం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు


రేపు 'అన్నదాత సుఖీభవ'

● రెండో విడత నిధులు విడుదల: మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): 'అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులు ఈ నెల 19న విడుదల కానున్నాయి. తొలివిడత జమకాని రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులు సైతం పరిశీలించి అర్హులైన ప్రతి రైతుకూ ఈ నిధులు జమయ్యేలా చర్యలు తీసుకోవాల'ని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్, 26 జిల్లాల జేడీలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. 'వైఎస్సార్ జిల్లా కమలాపురం నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. 46,62,904 మంది రైతులకు రూ.3077.77కోట్లు వారి ఖాతాల్లో జమ చేయనున్నాం. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ నిధులు రూ.2వేలు, రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులు రూ.5వేలు మొత్తం రూ.7వేల చొప్పున రైతులు ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలి. ఈ పథకం ద్వారా చేయూతనివ్వడం భారం కాదు బాధ్యత. ఎన్‌పీసీఏలో ఇన్‌యాక్టివ్‌గా ఉన్న ఖాతాలను యాక్టివేట్ చేయాలి. అర్హులైన రైతులు చనిపోతే.. వారి వారసులకు డెత్ మ్యూటేషన్ చేసి ఈ పథకం వర్తింపజేయాలి. వ్యవసాయ శాఖ కిందిస్థాయి సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి పథకం గూర్చి రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాల'ని మంత్రి అచ్చెన్న స్పష్టం చేశారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందజేస్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సోమవారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. తమ పిల్లలకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కొందరు, గత ప్రభుత్వ హయాంలో పింఛన్లు నిలుపుదల చేశారని మరికొందరు, నూతన గృహాలు మంజూరు, రహదారులు ఏర్పాటు చేయాలని ఇంకొందరు వినతులు అందజేశారు. వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇల్లు లేనివారికి త్వరలో గృహాలు మంజూరు చేస్తామని, ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



బాబోయ్ కిడ్నాప్‌లు

● జిల్లాలో పెరుగుతున్న ఘటనలు
● ఆస్తి, సివిల్ తగాదాలే కారణం
● వెలుగులోకి వచ్చినవి కొన్నే

శ్రీకాకుళం క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేర సంస్కృతి పెరుగుతోంది. అప్పట్లో పట్టణాలకే పరిమితమైన ఈ సంస్కృతి గ్రామాలకు సైతం పాకుతోంది. ప్రధానంగా భూదందాలు, ఆస్తి తగాదాలు, సెటిల్‌మెంట్‌లు మూలంగానే ఈ ఘటనలు జరుగుతున్నాయి. శ్రీకాకుళం జిల్లా కేంద్రంతో పాటు పలాస, కాశీబుగ్గ, నరసన్నపేట వంటి పట్టణాల్లో తరచూ ఈ ఘటనలు వెలుగుచూస్తున్నాయి. శ్రీకాకుళం చుట్టుపక్కల ప్రాంతాల్లో భూ సెటిల్‌మెంట్‌లు, నరసన్నపేటలో బంగారం వ్యాపారం, టెక్కలిలో గ్రానైట్ వ్యాపారాలు, పలాస జీడిలో వ్యాపార లావాదేవీలు వంటివి కిడ్నాప్ ఘటనలకు (మిగతా 6వ పేజీలో..)

● కొన్ని నెలల కిందట కాశీబుగ్గలోని గణేష్ ఆఫ్‌సెంటర్ ప్రింటర్స్ అధినేత గోపి అనే వ్యక్తిని ఓ ఆర్మీ ఉద్యోగి కిడ్నాప్ చేయించాడు. నెల రోజుల పాటు ఆయన ఆచూకీ తెలియలేదు. అడిగినంత డబ్బులు ఇచ్చిన తర్వాత దుండగులు విడిచిపెట్టారు. ఇప్పటికీ ఆ కేసులో చిక్కుముడి వీడలేదు.

● కొన్నేళ్ల కింద శ్రీకాకుళం నగరంలో ఓ డాక్టర్ కిడ్నాప్ ప్రయత్నం కలకలం సృష్టించింది. కిమ్స్ ఆసుపత్రి ఎదురుగా నివాసముంటున్న ఓ డాక్టర్‌ను కిడ్నాప్ చేసే క్రమంలో నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు.



● ఈ నెల 6న పలాసకు చెందిన ప్రముఖ జీడి వ్యాపారి, బ్యాంకుల కన్సల్‌టెంట్ **వి.లక్ష్మీనారాయణరాజు** (వీఎల్ఎన్ రాజు)ను ఆమదాలవలసకు చెందిన వ్యాపారి పొట్నూరు వేణుగోపాలరావు, ఆయన అనుచరులు కిడ్నాప్ చేశారు. ఆమదాలవలసలో రాజు పేరిట ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు బలవంతంగా ఆయనను కారులో ఎత్తుకెళ్లారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. కిడ్నాపర్లను ఫోన్‌లో హెచ్చరించడంతో ఆ రోజు సాయంత్రానికి నరసన్నపేటలో రాజును వారు విడిచిపెట్టేశారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురిని పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు.



● నరసన్నపేటలోని లచ్చుమన్నపేటకు చెందిన బంగారం కొరియర్ **పొట్నూరు గుప్త** ఆగస్టు 26న కారులో విశాఖపట్నం వెళ్లి.. తిరిగి ఇంటికి చేరుకోలేదు. నాలుగు రోజులపాటు ఆయన ఆచూకీ లేకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెంది ఆ నెల 31న పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు రంగంలోకి దిగి దర్యాప్తు చేయగా.. గుప్త వద్ద పనిచేస్తున్న కారు డ్రైవర్ డబ్బుకు ఆశ పడి.. మరో వ్యక్తితో కలిసి గుప్తను హత్య చేసినట్టు తేలింది. శ్రీకాకుళం సమీపంలోని ఓ గెడ్డలో గుప్త మృతదేహాన్ని పడేసినట్టు పోలీసులు గుర్తించారు.

పోలీసులను ఆశ్రయించాలి

సివిల్ తగాదాలతోపాటు ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి కిడ్నాప్ ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇద్దరు వ్యక్తుల మధ్య జరుగుతున్న వివాదాల్లో మూడో వ్యక్తి రావడంతోనే నేర తీవ్రత పెరుగుతోంది. వీలైనంతవరకు శాంతియుతంగా పరిష్కరించుకోవాలి. లేదంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలి. చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు.

- కేవీ రమణ,
ఏఎస్పీ, శ్రీకాకుళం

ఈపీడీసీఎల్ పరిధిలో

100 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు

● గ్రిడ్‌కు అనుసంధానం
● సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి



విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) పరిధిలో 100 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటుచేసినట్టు సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఆయన సోమవారం విశాఖపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం కింద ఇప్పటివరకూ 31,022 రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను పెట్టామన్నారు. వాటి ద్వారా 1,00,026 కిలోవాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతోందన్నారు. ఏలూరు జిల్లాలో అత్యధికంగా 13,491 కిలోవాట్లు, కాకినాడ జిల్లాలో 3,960, విశాఖపట్నం జిల్లాలో 3,715, తూర్పు గోదావరి (మిగతా 6వ పేజీలో..)



నరసన్నపేట మార్కెట్ యార్డులో హమాలీలతో మాట్లాడుతున్న పౌరసరఫరాలశాఖ డీఎం వేణుగోపాల్

రైతులకు ఖర్చు లేకుండా ధాన్యం కొనుగోలు

● మిల్లర్ల బ్యాంకు గ్యారెంటీ లేక జాప్యం
● పౌరసరఫరాలశాఖ డీఎం వేణుగోపాలరావు

నరసన్నపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): 'రైతులకు రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేశామ'ని జిల్లాపౌరసరఫరాలశాఖ డీఎం వేణుగోపాల్ తెలిపారు. సోమవారం నరసన్నపేట మార్కెట్ కమిటీ ఆవరణలో గిడ్డంగులను పరిశీలించారు. 'జిల్లాలో అధికారికంగా ధాన్యం కొనుగోలు ప్రారంభించిన తర్వాత పక్రియ వేగవంతంగా సాగుతుంది. మిల్లర్లు బ్యాంక్ గ్యారెంటీలు ఇవ్వకపోవడంతో కొనుగోలు జాప్యమవుతోంది. 406 కేంద్రాల ద్వారా రైతులకు షెడ్యూల్ ఇస్తాం. ఈలింగ్, కళాసీల చార్జీల పేరుతో మిల్లర్లు దోపిడీకి పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామ'ని డీఎం తెలిపారు. మార్కెట్ కమిటీ ఆవరణలో గోదాములకు ఎఫ్‌సీ బియ్యం రాకపోవడంతో పని లేకుండా పోతుందని వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గిడ్డంగుల కళాసీలు డీఎం వద్ద మొర పెట్టుకున్నారు. ఇతర ప్రాంతాలకు తరలించడంతో ఏడాది పొడవునా ఉపాధి లేకుండా పోతుందని వాపోయారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

● జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం లీగల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా కోర్టు భవనంలో పోలీసు అధికారులతో ఆయన సమావేశమయ్యారు. 'జాతీయ లోక్‌అదాలత్‌లో ప్రజలకు న్యాయం చేకూర్చే విధంగా ఎక్కువ కేసులను రాజీ చేయాలి. రాజీ చేయడం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు వృథాకావు. త్వరితగతిన కక్షిదారులకు న్యాయం చేసేందుకు ప్రయత్నించాల'ని జిల్లా న్యాయాధికారి తెలిపారు. సమావేశంలో జిల్లా న్యాయమూర్తులు 1, 3, 4వ అదనపు జిల్లా న్యాయాధికారులు పి.భాస్కరరావు, వివేకానంద శ్రీనివాస్, ఎస్.ఎం. ఫణికుమార్, జిల్లాన్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు, అడిషనల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి పి.శాంతిశ్రీ, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో నిర్వహిస్తున్న స్కిల్‌హబ్‌సెంటర్‌లో ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, సైబర్ భద్రతా కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తున్నాం. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుకు పదో తరగతి, సైబర్ భద్రత కోర్సుకు ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగి 18-30 ఏళ్లలోపు యువతీ యువకులు అర్హులు. 3 నెలలపాటు శిక్షణ పూర్తయిన అనంతరం సర్టిఫికెటుతో పాటు ఉద్యోగావకాశం కల్పిస్తాం. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ లోపు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలోని స్కిల్ హబ్ సెంటర్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాల కోసం 79891 77887 నెంబర్‌లో సంప్రదించాల'ని ప్రిన్సిపాల్ సూచించారు.

ఆర్ట్స్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

గుజరాతీపేట. నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల (ఆర్ట్స్) కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీల లో ప్రవేశించేందుకు స్పాట్ అడ్మిషన్లు ఓపెన్ అయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డా.వై.పోలినాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేయనున్నామన్నారు. ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటివరకు చేరని విద్యార్థులు ఈ నెల 20లోగా కళాశాలలో దరఖాస్తును అందించాలని తెలిపారు.

బస్సు ఎక్కాలంటే పాట్లే

● ఊరికి దూరంగా ఇచ్ఛాపురం ఆర్టీసీ కాంప్లెక్స్

● పాత బస్టాండ్‌లో ఆగని వైనం
● కానరాని వసతులు
● ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు



అధ్వానంగా ఇచ్ఛాపురం ఆర్టీసీ కాంప్లెక్స్

ఇచ్ఛాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. జిల్లాలో ఏర్పడిన రెండో కాంప్లెక్స్ ఇది. కానీ అధికారుల అనాలోచిత నిర్ణయాలు ప్రజల పాలిట శాపాలుగా మారుతున్నాయి. ఇచ్ఛాపురం పట్టణానికి దూరంగా కాంప్లెక్స్ ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ కాంప్లెక్స్ ఏడున్నర ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఖాళీ స్థలాలను అభివృద్ధి చేయాలని ఆర్టీసీ ఆలోచించింది. కానీ ప్రయాణికులకు సదుపాయాలు మాత్రం మెరుగుపరచలేదు. కాంప్లెక్స్ ఆవరణను లీజుకివ్వడంతో అక్కడ కళ్యాణ మండపం నిర్మించారు. మిగిలిన ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేశారు. కానీ ప్రయాణికులకు సంబంధించి వసతులు మెరుగుపరచలేదు. ఉన్నవాటిని తొలగించి పలాసకు తరలించారు. ఏ బస్సు ఎప్పుడు వస్తుందో చెప్పే కంట్రోలర్‌తోపాటు అక్కడుండే కుర్చీలను సైతం పలాసకు తీసుకెళ్లారు. దీంతో బస్సుల రాకపోకలు, వాటి సమయాలు చెప్పేవారు కరువయ్యారు.

● వేకువజాము నుంచి బస్సుల తాకిడి..

రవాణాపరంగా సరిహద్దున ఉన్న ఒడిశా సైతం ఇచ్ఛాపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌పై ఆధారపడుతోంది. ఇక్కడ నుంచి 56 అంతర్‌జిల్లా సర్వీసులు నడుస్తున్నాయి. తెల్లవారుజామున 3.45 గంటలకు ప్రారంభమై.. రాత్రి 9 గంటల వరకూ బస్సులు తిరుగుతూనే ఉంటాయి. రావులపాలెం, రాజమండ్రి, రామచంద్రాపురం, రాజోలు, తాడేపల్లిగూడెం, కొవ్వూరు, విజయవాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాలకు సర్వీసులు నడుస్తుంటాయి. కానీ ఇంతటి ప్రాధాన్యం కలిగిన కాంప్లెక్స్‌లో బస్సుల రాకపోకల వివరాలు (మిగతా 6వ పేజీలో..)

ప్రయోజనం లేదు

పేరుకే పెద్ద ఆర్టీసీ కాంప్లెక్స్. కానీ జనాలకు ఎంతమాత్రం ప్రయోజనం లేకుండా పోతోంది. కాంప్లెక్స్‌లో ఏ బస్సు ఎప్పుడు ఎక్కడకు వెళుతుంది? అన్న వివరాలు కూడా చెప్పేవారు లేరు. వాటర్ బాటిల్ కొందామన్నా దుకాణం లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ యంత్రాంగం దృష్టి పెట్టాలి.

- కొరికాన యోగి, ప్రయాణికుడు, ఇచ్ఛాపురం

ఇక్కడే సర్వీసులు మొదలైనా..

పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టు ఉంది మా పరిస్థితి. అంతర్ జిల్లా సర్వీసులు ఇచ్ఛాపురం నుంచే ప్రారంభమవుతాయి. కానీ పట్టణంలో ఆర్టీసీ బస్సు ఎక్కడానికి వీలు లేకుండా పోతోంది. పట్టణానికి కిలోమీటరు దూరంలో ఉన్న కాంప్లెక్స్‌కు వెళ్లాలంటే యాతన తప్పడం లేదు. పాత బస్టాండ్‌లో బస్సులు ఆగేలా చర్యలు చేపట్టాలి.

- కాళ్ల నరసింహమూర్తి, ప్రయాణికుడు, ఇచ్ఛాపురం



కంబకాయిలో ఆరబెట్టిన ధాన్యాన్ని భద్రం చేస్తున్న రైతులు

వాతావరణం మార్పులతో
రైతుల్లో కలవరం
కోసిన వరిపైరును కుప్పలు పెడుతున్న వైనం 6లో

అధికారులు హాజరు కాకుంటే
షోకాజ్ నోటీసులు
● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ 6లో

స్మార్ట్ కిచెన్ ఏర్పాటు రద్దు చేయాలి
మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ధర్నా 7లో

రోడ్డు కోసం చంగుడి గ్రామస్థుల ఆందోళన 8లో
● నాలుగు రోజుల్లో ప్రారంభిస్తాం
● ఎమ్మెల్యే గోవిందరావు


హరోం హర



అరసవల్లి: నాగావళి నదిలో తెప్పలు వదులుతున్న భక్తులు



టెక్కలి రూరల్: ఎండల మల్లికార్జున స్వామికి కుటుంబసభ్యులతో కలిసి పూజలు చేస్తున్న రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు



గార: శ్వేతగిరిపై వీర వసంతేశ్వరస్వామికి నక్షత్ర హారతి

● శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

కార్తీక మాసంలో చివరి నాలుగో సోమవారం జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే ఆలయాల వద్ద అధిక సంఖ్యలో భక్తులు బారులుతీరారు. హరహర మహదేవ శంభో శంకర అంటూ ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. శ్రీకాకుళం, ఆమదాలవలస నరసన్నపేట, జలుమూరు, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం, పాతపట్నం తదితర పట్టణాలతోపాటు గ్రామాల్లోని శైవక్షేత్రాలు భక్తులతో కళకళలాడాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. వివిధ ఆలయాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం



వజ్రపుకొత్తూరు: బెండినందికేశ్వర ఆలయంలో..



ఇచ్ఛాపురం: పాతాళసిద్ధేశ్వర ఆలయంలో..



అరసవల్లి: ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయం వద్ద..



కంచిలి: భోళాలింగేశ్వర ఆలయంలో నంది వద్ద పూజలు



హిరమండలం: పాతకొండరాగోలులో సామూహిక రుద్రాభిషేకాలు



జలుమూరు: శ్రీముఖలింగేశ్వరుని దర్శనానికి క్యూలో భక్తులు



హరిపురం: అంబుగాం కాశీవిశ్వేశ్వరాయంలో..



ఆమదాలవలస: అక్కులపేటలో సామూహిక రుద్రాభిషేకం



సోంపేట: శ్రీశయన సంఘ ఆధ్వర్యంలో శివపార్వతుల ఊరేగింపు



పాతపట్నం: సోద గ్రామంలోని నీలకంఠేశ్వర ఆలయంలో..



జలుమూరు: శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో విజయనగరం ఎంపీ కలిశెట్టి



అరసవల్లి: ఉమారుద్ర కోటేశ్వరుని దర్శించుకుంటున్న డీఎస్పీ వివేకానంద

వాతావరణ మార్పులతో రైతుల్లో కలవరం

● కోసిన వరిపైరును కుప్పలు పెడుతున్న వైనం

నరసన్నపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తుపాన్ హెచ్చరికలో రైతుల్లో కలవరం మొదలైంది. ఆకాశంలో ఒక్కసారిగా మార్పులు రావడంతో ముఖ్యంగా వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా సుమారు 3.80 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. ఇప్పటికే 50వేల ఎకరాల్లో వరి కోతలు పూర్తి కాగా.. 30వేల ఎకరాల్లో నూర్పుడిలు పూర్తయ్యాయి. ధాన్యం రోడ్ల మీద, కల్లాల్లో ఆరబోశారు. ధాన్యం కొనుగోలు ఇంకా మొదలు కాకపోవడంతో చాలామంది రైతులు దళారులకు అమ్ముకుంటున్నారు. మరికొందరు మిల్లర్లుకు పంపిస్తున్నారు. ప్రస్తుతం తుపాన్ హెచ్చరికలతో రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. వంశధార ఎడమ కాలువ పరిధిలో జలుమూరు, నరసన్నపేట, పోలాకి మండలాల్లో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. సోమవారం ఆకాశం మేఘావృతం కావడంతో రైతులు కోతలు నిలిపివేశారు. ఇప్పటికే కోతలు పూర్తయి పొలాల్లో ఉన్న పైరును కుప్పలు వేస్తున్నారు. కొన్నిచోట్ల నేరుగా నూర్పిళ్లు చేస్తున్నారు. వర్షం కురిసినా పంట తడవకుండా ఉంటేచాలని రైతులు ఆశిస్తున్నారు. పొలాల్లో కుప్పల వద్ద నీరు నిలిచిపోకుండా, తడవకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపడుతున్నారు.



రెడ్డికపేటలో పొలల్లో వరిపనలను కుప్పలు పెడుతున్న రైతులు

అధికారులు హాజరు కాకుంటే షోకాజ్ నోటీసులు

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు హాజరు కాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. జడ్పీ సమావేశ మందిరంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 120 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రీవెన్స్‌లో వచ్చే వినతు లను సంబంధిత అధికారులు పరిశీలించి అర్జీదారు సంతృప్తిపడేలా సకాలంలో పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్లు పద్మావతి, జయదేవి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, రిటైర్డ్ డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పుండ్కర్



పింఛన్ పునరుద్ధరించండి

తన చిన్నతనం నుంచి రెండుకాళ్లు పనిచేయలేదని.. రూ.200 నుంచి పింఛన్ పొందానని, అయితే గత ప్రభుత్వంలో పింఛన్ నిలుపుదల చేశారని నగరంలోని దమ్మలవీధికి చెందిన పట్నాల సూర్యనారాయణ ఆవేదన వ్యక్తంచేశాడు. పింఛన్ పునరుద్ధరించి ఆదుకోవాలని కలెక్టర్‌ను వేడుకుని వినతిపత్రం అందించాడు.

గ్రీవెన్స్‌కు వస్తున్న దివ్యాంగుడు పట్నాల శ్రీనివాసరావు

గౌరవ భృతి బకాయిలు చెల్లించండి

16 నెలలుగా దినపత్రికల గౌరవ భృతి చెల్లించలేదని తగు చర్యలు తీసుకోవాలని బుక్ డిపాజిట్ సెంటర్ల (బీడీసీ) నిర్వాహకులు కోరారు. ఈ మేరకు గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. బిల్లుల కోసం సంబంధిత అధికారులను అడిగితే నిధులు రాలేదని చెబుతున్నారు. అన్ని జిల్లాల్లో ఇప్పటికే చెల్లింపుల జరిగిపోయినా, ఈ జిల్లాలో మాత్రమే బకాయిలు ఇవ్వలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.

బాబోయ్ కిడ్నాప్‌లు

(ఐదో పేజీ తరువాయి)

దారి తీస్తున్నాయి. కోట్లాది రూపాయల లావాదేవీలు జరుగుతుండడంతో మధ్యవర్తులు ఎక్కువగా రంగ ప్రవేశం చేస్తున్నారు. ఈ తరుణంలో పంపకాల్లో వస్తున్న వ్యత్యాసాలు నేరాలకు పురిగొల్పుతున్నాయి.

● జిల్లాలో కిడ్నాప్ ఘటనలకు సంబంధించి గతేడాది ఏడు కేసులు, ఈ ఏడాది ఇప్పటివరకు మూడు కేసులు నమోదయ్యాయి. పోలీసుల దృష్టికి రానివి ఇంకెన్నో ఉన్నాయి. అడ్డదారిలో డబ్బులు సంపాదించేందుకు కొందరు కిరాయి వ్యక్తులను తీసుకొస్తున్నారు. గతంలో బిహార్, కోల్‌కత్తా, కటక్ ప్రాంతాల నుంచి ఆగంతుకులు వచ్చి నేరాలకు పాల్పడేవారు. ఇప్పుడు స్థానికంగా కూడా ఇలాంటి వ్యవహారాలను చక్కబెట్టే ముఠాలు పుట్టుకొచ్చాయి. సెటిల్‌మెంట్‌లు రూపంలో లక్షలాది రూపాయల ఆదాయం వస్తుండడంతో కిడ్నాప్‌లకు తెరతీస్తున్నారు. వీటి నియంత్రణపై పోలీసులు మరింత దృష్టిపెట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.

బస్సు ఎక్కాలంటే పాట్లే

(ఐదో పేజీ తరువాయి)

చెప్పేవారు లేరు. కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు అవసరమయ్యే నీరు, ఇతరత్రా వస్తువులు కొనుగోలు చేసేందుకు వీలుగా చిన్నపాటి దుకాణాలు కూడా ఏర్పాటు చేయలేదు. విద్యుత్ దీపాలు లేవు. మరుగుదొడ్లు ఉన్నా వినియోగానికి పనికిరావు. ఇతర డిపోలకు చెందిన దాదాపు పదుల సంఖ్యలో సర్వీసులకు నైట్‌హాల్ట్ ఇక్కడే. కాంప్లెక్స్ మేడపై విశ్రాంతి గది నిర్మించారు. కానీ సదుపాయలు కల్పించడం మరచిపోయారు.

● కిలోమీటరు నడవాల్సిందే..

ఇచ్ఛాపురం పట్టణానికి దూరంగా ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లాలంటే కిలోమీటరు ఆపసోపాలు పడాల్సిందే. గతంలో పాత బస్టాండ్‌కు వచ్చి ఆర్టీసీ బస్సులను నిలుపుదల చేసేవారు. కానీ ఇప్పుడు అలా లేదు. బస్సెక్కాలంటే ప్రయాణికులు కాంప్లెక్స్‌కు రావాల్సిందే. ప్రతిరోజూ ఇచ్ఛాపురం మీదుగా 3 వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్సులు పాత బస్టాండ్‌కు రాకపోవడంతో ప్రైవేటు ట్రావెల్ బస్సులు అందుబాటులో ఉంటున్నాయి. పైగా ఎస్.కోట, అనకాపల్లి, రాజాం, పాలకొండ, పార్వతీపురం, బరంపూర్ వంటి రూట్లలో ఆర్టీసీ సర్వీసులు లేవు. కానీ పదుల సంఖ్యలో ప్రైవేటు బస్సులు ఉన్నాయి. ఆర్టీసీ సర్వీసులు అందుబాటులో తెస్తే తమ వెతలు తీరడమే కాదు ఆర్టీసీకి ఆదాయం మెరుగయ్యే అవకాశం ఉందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఈ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

దృష్టి సారించాం

ఇచ్ఛాపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాం. వసతులు మెరుగుపరిచేందుకు చర్యలు చేపడతాం. పాతబస్టాండ్‌లో బస్సులు ఆగేలా ఆదేశాలు ఇస్తాం. మహిళలు ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అవసరమైన రూట్లలో సర్వీసులను సైతం తిప్పుతాం.

- ఎస్‌వీవీ నాయకుడు, డిపో మేనేజర్, పలాస



రోడ్డుపై వెళుతున్న కోతులు

వామ్మో.. కోతులు

● వరుస దాడులతో ప్రజలకు గాయాలు

● నియంత్రించాలని వేడుకోలు

ఇచ్ఛాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో కోతుల బెడద రోజు రోజుకూ పెరుగుతోంది. సోమవారం ఉదయం ఒక్కసారిగా వందలాది కోతులు కోర్టు వీధిలోకి చేరడంతో స్థానికులు బెంబేలెత్తి పోయారు. కోతుల గుంపును చూసిన విద్యార్థులు పరుగులు తీశారు. కోతులు వెంటబెట్టడంతో కొందరు చిన్నారులు కిందపడి గాయపడ్డారు. కోతులను నియంత్రించడంలో మునిసిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. కోతులను పూర్తి స్థాయిలో నియంత్రించాలని వైస్ ఛైర్‌పర్సన్లు భారతి దివ్య, స్వర్ణమణితో పాటు పలువురు కౌన్సిలర్లు కోరుతున్నారు.

ఈపీడీసీఎల్ పరిధిలో 100 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు

(ఐదో పేజీ తరువాయి)

జిల్లాలో 3,532, పశ్చిమ గోదావరి జిల్లాలో 3,382, శ్రీకాకుళంలో 3,366, విజయనగరంలో 3,279, అనకాపల్లి జిల్లాలో 2,841, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1,934, పార్వతీపురం మన్యంలో 864, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 15 సోలార్ రూఫ్‌టాప్‌లు అమర్చామన్నారు. వీటన్నింటినీ గ్రిడ్‌కు అనుసంధానం చేశామన్నారు. అపార్టుమెంట్లలో వ్యక్తిగత సోలార్ ప్లాంట్లకు అవకాశం లేనందున, కామన్ సర్వీస్‌కు ఉన్న కాంట్రాక్ట్ లోడ్‌కు అనుగుణంగా సోలార్ రూఫ్ టాప్ పెట్టుకోవచ్చునన్నారు. 500 కిలోవాట్ల వరకు కిలోవాట్‌కు రూ.18 వేలు చొప్పున రాయితీ లభిస్తుందన్నారు. అతి తక్కువ వడ్డీకి బ్యాంకు రుణాలు, ఈఎంఐలు ఇస్తాయన్నారు. వినియోగదారులు పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకొని, అందులో ఎంప్యానల్ అయిన వెండర్స్ నుంచి సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తుకు, నెట్ మీటర్‌కు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. స్మార్ట్ మీటరు పెట్టుకున్న వారికి నెట్ మీటర్ అవసరం లేదని స్పష్టంచేశారు. ఇంకేమైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చునన్నారు.

కొబ్బరికి సోకే తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి



కొబ్బరి తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కొబ్బరికి సోకే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ కళాశాల అధ్యాపకులు సూచించారు. ధర్మవరం గ్రామంలో కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల (ఎస్ఎస్ఆర్‌పురం) ఆధ్వర్యంలో సోమవారం ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం నిర్వహిం చారు. ఈ సందర్భంగా రైతులకు కొబ్బరికి సోకే తెగుళ్లపై అవగాహన కల్పించారు. కొబ్బరిలో కొమ్ము పురుగు, ఎర్రముక్కు పురుగు, ఇథియోఫిడ్ నల్లి, సర్పిలాకారపు తెల్ల దోమను గుర్తించి వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కొమ్ము పురుగుకు నాఫ్తలీన్ గోళీలు కొమ్మకు అటు ఇటు వైపు ఒకటి, అలాగే క్లోరాంట్రనిలిప్రోల్, సాచేట్లను పెట్టాలని సూచించారు. ఎర్రముక్కు పురుగు ఉధృతంగా ఉంటే ఇమి డాక్లోమిడ్ -1 మి.లీ/లీటరు నీటిలో కలిపి పిచ్‌కారీ చేయాలన్నారు. కొమ్ము పురుగు, ఎర్రముక్కు పురుగుకు బకెట్ ట్రాప్లను 1 హెక్టార్‌కి 2 చెప్పున పెట్టాలన్నారు. సర్పిలాకారపు తెల్లదోమకు పసుపు రంగు జిగట ముచ్చెలను కట్టాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ నారన్నాయుడు, అధ్యాపకులు డాక్టర్ దేవికారాణి, భవాని, డాక్టర్ సత్యానారాయణ, శివానీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అపరాల్లో అధిక దిగుబడి

● శాస్త్రవేత్త ఆలపాటి సత్యనారాయణ



మాట్లాడుతున్న శాస్త్రవేత్త ఆలపాటి సత్యనారాయణ

నరసన్నపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రబీలో తక్కువ పెట్టుబడితో అపరాల పంట సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించడమే కాకుండా రైతులకు గిట్టుబాటు అవుతుందని అపరాల శాస్త్రవేత్త ఆలపాటి సత్యనారాయణ అన్నారు. సోమవారం కిల్లాం గ్రామంలో అపరాలు సాగు, రబీలో వరి సాగుపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. విత్తనం ఎంపిక నుంచి ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. పెసర, మినప సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఎకరాకు ఏడు బస్తాల దిగుబడి వస్తుందన్నారు. జీరో పెట్టుబడితో అధిక లాభాలను రైతులను పొందే విధానం వివరించారు. వరిలో ఎస్ఎస్ఆర్-2, ఎస్ఎస్ఆర్-4 జిల్లా రైతాంగానికి అనువైన వరి రకాలుగా తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, వ్యవసాయ శాస్త్రవేత్త శిమ్మ నేతాజీ, యాళ్ల వేణు గోపాలరావు, బీఆర్ రామన్న తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టుతో ఉపాధి అవకాశాలు మెరుగు

● ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన కూటమి నాయకులు



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న కూటమి నాయకులు

పలాసరూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉద్దానంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం వల్ల ఈ ప్రాంత ప్రజానీకానికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయని, ఎయిర్‌పోర్టు నిర్మాణం జరిగేలా చూడాలని కోరుతూ కూటమి నాయకులు ఆర్డీవో జి.వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. పలాస రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం ఆర్డీవో గ్రంథి వెంకటేష్‌ను వారు కలిశారు. కొంతమంది ప్రతిపక్షనాయకులు, ఆవశ్యకత తెలియని వారు దీన్ని వ్యతిరేకిస్తున్నారని, ఈ ప్రాంతంలో ఇలాంటి పెద్ద ప్రాజెక్టుల నిర్మాణంతో ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఈనెల 14, 15వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సదస్సులో ఎయిర్‌పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియాతో రాష్ట్రప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకోవడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్, కేంద్రమంత్రి రామ్మోహన్నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతుశిరీషకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్డీవో వెంకటేష్ మాట్లాడుతూ భూములు ఇస్తున్న రైతులను ఇంటింటికి వెళ్లి కలుస్తున్నామని, ఆవశ్యకతను తెలియజేసి సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మందస, వజ్రపుకొత్తూరుకు చెందిన కూటమి నాయకులు దాసరి తాతారావు, రట్టిలింగరాజు, సంతోష్‌పండా, లబ్బ రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలి

● ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదికను నిర్వహించారు. ఆయన వృద్ధులు, దివ్యాంగుల వద్దకు వెళ్లి స్వయంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 53 మంది ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడారు. తక్షణం ఫిర్యాదులను పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయా స్టేషన్ అధికారులకు ఆదేశించారు. భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, మోస పూరిత, ఆస్తి తగాదాలు, కొట్లాట, ఇతర సమస్యలపై 53 ప్రజా ఫిర్యాదులు స్వీకరించారు.

స్మార్ట్ కిచెన్ ఏర్పాటు రద్దు చేయాలి


ధర్నా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వీర్యం చేసే స్మార్ట్ కిచెన్‌ల ఏర్పాటును తక్షణమే రద్దు చేయాలని ఆ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు కె.నాగమణి, అధ్యక్ష, కార్యదర్శులు కె.సుశీల, బి.ఉత్తర డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వం అక్షయపాత్ర, నాంది ఫౌండేషన్ వంటి సంస్థలకు కాంట్రాక్టు ఇచ్చి విఫలమైందని, మరలా స్మార్ట్ కిచెన్‌ల పేరుతో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలనుకోవడం సరికాదన్నారు. అనంతరం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం నేతలు టి.సీతమ్మ, కె.కౌసల్య, వై.లక్ష్మి, పి.భూదేవి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు రేపటి తరానికి ఆదర్శప్రాయులు

● జిల్లాన్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు


మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం లీగల్, నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి): రేపటి తరానికి వృద్ధులు ఆదర్శప్రాయమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. స్థానిక న్యాయసేవా సదన్‌లో సోమవారం వయో వృద్ధుల సంక్షేమంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధులు ముఖ్యంగా ఆర్థిక భద్రత, అనారోగ్య సమస్యలు, సామాజిక ఒంటరితనం తదితర సవాళ్లను ఎదుర్కొంటున్నారన్నారు. పిల్లలు వృద్ధుల పోషక బాధ్యతను పట్టించుకోకుంటే ముందుగా ఆర్డీవో వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. వృద్ధుల పట్ల ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే భయపడి ఆ విషయాన్ని దాచకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. సీనియర్ సిటిజన్‌ల నిర్వహణ, సంక్షేమ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎన్‌జీవోల సంఘం అధ్యక్షుడు ఎన్.కేశవరావు, న్యాయవాది గేదెల ఐందిరా ప్రసాద్, పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ ఉసురు తీస్తున్న కేంద్రం



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

అరసవల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా సంఘం విస్తృత సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేదలు, దళితులు, గిరిజన, బలహీన వర్గాలకు చెందిన 15 లక్షల జాబ్‌కార్డులు తొలగింపునకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. దళితులు, గిరిజనులు, భూములకు రక్షణగా ఉన్న చట్టం సవరణను తక్షణం ఉపసంహరించాలన్నారు. జిల్లాలో కార్గో ఎయిర్‌పోర్టు, థర్మల్ విద్యుత్ కేంద్రం పేరుతో చేపడుతు న్న బలవంతపు భూసేకరణ ఆపాలన్నారు. పోర్ట్, థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని రద్దు చేయాలని సాగుతున్న ప్రజా పోరాటంలో సంఘం భాగస్వామ్యం అవుతుందన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శిర్ల ప్రసాద్, జిల్లా కార్యదర్శి గంగరాపు సింహాచలం, ఈశ్వరమ్మ, కొల్లి ఎల్లయ్య, శిర్ల మంగమ్మ, గంగరాపు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా..!

● కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా జిల్లాలోని పలు శాఖా గ్రంథాలయాల్లో సోమవారం వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 20న బహుమతులు అందిస్తామని గ్రంథాలయాధికారులు తెలిపారు. -ఆంధ్రజ్యోతి బృందం




ఆమదాలవలస, గారలో : వక్తృత్వ, వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు, నందిగాం: క్విజ్ పోటీలో పాల్గొన్న చిన్నారులు




టెక్కలి, కొత్తూరుల్లో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు, జి.సిగడాం: వక్తృత్వ పోటీ నిర్వహిస్తున్న నిర్వాహకులు

బీపీఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

● కమిషనర్ తమ్మినేని రవి

ఆమదాలవలస, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలో అనుమతులు లేకుండా నిర్మించిన గృహ, వాణిజ్య భవనాల నిర్మాణాలను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్) అనుమతులు మంజూరు చేసిందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ తమ్మినేని రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా 1985 జనవరి నుంచి 2025 ఆగస్టు 31వ తేదీలోగా నిర్మాణాలు పూర్తయిన నివాస వాణిజ్య భవన నిర్మాణాల ప్లాన్‌కు డివియేషన్ ఉన్న అన్ని భవన నిర్మాణాలకు ఒకేసారి రెగ్యులరైజేషన్ చేసుకొనేందుకు ప్రభుత్వం ఈనెల 14వ తేదీ నుంచి 2026 మార్చి 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లోగాని, ఎల్‌డీపీ ద్వారా గాని దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ పరిధిలో ఉన్న భవన యజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఐక్యతకు నిదర్శనం: అశోక్

కవిటి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఐక్యతకు నిదర్శనం కార్తీక వనభోజనాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. కవిటిలోని శ్రీక్రిష్ణభార్గవ కాళింగ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కార్తీక వన భోజన కార్యక్రమం ఆసుపత్రి వీధిలోని తోటలో నిర్వహించారు. మహిళలు ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. అందరితో కలిసి ఎమ్మెల్యే వనభోజనం చేశారు.

పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ

● రాజశేఖర్‌కు బంగారు పతకం



రాజశేఖర్‌కు బంగారు పతకం అందిస్తున్న ఈవెంట్ నిర్వాహకులు

గార, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భూటాన్‌లో ఆదివారం ఎస్‌టీకేఎఫ్ ఫౌండేషన్ వారు నిర్వహించిన 12వ ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కొర్ని గ్రామానికి చెందిన చమళ్ల రాజశేఖర్ బంగారు పతకం సాధించాడు. 5 కేజీల విభాగంలో ప్రతిభ కనబరిచాడు. ఈ మేరకు అక్కడి పోటీల నిర్వాహకులు రాజశేఖర్‌కు మెమెంటోను అందించి అభినందించారు. గత నెలలో బెంగళూరులో నిర్వహించిన జాతీయ స్థాయిలో వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాజశేఖర్ మూడు విభాగాల్లో బంగారు పతకాలను సాధించాడు. అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన రాజశేఖర్‌ను కుటుంబ సభ్యులతో పాటు పలువురు గ్రామస్థులు అభినందించారు.

పెట్టుబడుల హబ్‌గా రాష్ట్రం: శంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో నిర్వహించిన సీఐఐ సదస్సులో 613 ఒప్పందాలు, రూ.13.27 లక్షల కోట్ల పెట్టుబడులతో రాష్ట్రం పెట్టుబడుల హబ్‌గా మారనుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సోమవారం విశాఖ-ఎ కాలనీలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో రాష్ట్రం ప్రపంచ దృష్టిని తనవైపు తిప్పుకుందన్నారు. నూతన ఒప్పందాలతో రాష్ట్రానికి 16.23 లక్షల ఉద్యోగాలు రానున్నాయన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు, క్వాంటమ్, మెట్రో, ఐటీ తదితర రంగాల్లో పెట్టుబడులతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయని తెలిపారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సమర్థత, విజన్‌తో రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ వచ్చిందన్నారు. వైసీపీ హయాంలో భయపడి పారిపోయిన కంపెనీలు కూడా రాష్ట్రానికి రావడం సంతోషదాయకమన్నారు. ఇంత అభివృద్ధి జరుగుతున్నా వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో నేతలు మధుబాబు, నాగేంద్రయాదవ్ పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా ప్రభుత్వం: ఎన్ఈఆర్


సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం బారిన పడి కష్టకాలంలో ఉన్న బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. సోమవారం బాతువలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ చేపట్టారు. బాతువ పీహెచ్‌సీని ఎమ్మెల్యే సందర్శించారు. ● వాండ్రంకి న్యూ బీసీ కాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులను ఎమ్మెల్యే ఎన్ఈఆర్ పరామర్శించారు. అగ్ని ప్రమాద కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి బి.అనూష, కూటమి నాయకులు కుమరాపు రవి కుమార్, బూరాడ వెంకటరమణ, వజ్జపర్తి రఘురాం, భూపతి అర్జున్ కుమార్, సర్పంచ్‌లు కల్యాణి, సాకేటి నాగరాజు, బోగాది అప్పలనాయుడు, కె.వెంకటరావు పాల్గొన్నారు.

తోటపాలెంలో..

ఎచ్చెర్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్‌తో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. తోటపాలెం గ్రామంలో వివిధ గ్రామాలకు చెందిన ఆరు బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్ చౌదరి అవినాష్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, కూటమి నేతలు విష్వక్సేన్, బెండు మల్లేశ్వరరావు, గూరు జగపతిబాబు, సంపతిరావు నాగేశ్వరరావు, గట్టెం శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా శిబిరంలో ప్రతిభ

● విద్యార్థులను అభినందించిన వీసీ రజని


ఎన్ఎస్ఎస్ విద్యార్థులను, పీవో కరుణానిధిని అభినందిస్తున్న వీసీ కేఆర్ రజని

ఎచ్చెర్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): హర్యానా రాష్ట్రం మహర్షి దయానంద్ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన జాతీయ సమైక్యతా శిబిరంలో డా.బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ ఎన్ఎస్ఎస్ బృందం పాల్గొని ప్రతిభ కనబరిచింది. వివిధ విభాగాల పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచడంతో సోమవారం వర్సిటీలో వారిని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అభినందించారు. ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, విశిష్టత, ఆచార వ్యవహారాల్లో వర్సిటీ బృంద ప్రతినిధులు ప్రశంసలు అందుకున్నారు. జి.స్రవంతి (కూచిపూడి), ఎస్.భార్గవి (దేశ సంకల్ప్ స్కిట్), క్రీడా విభాగంలో కె.పవన్ బృందం, ఎం.పవిత్ర, జి.రవితో కలిసి టగ్ ఆఫ్ వార్ ఈవెంట్, జి.చంద్రశేఖర్ (గిరిజన సంప్రదాయ వస్త్రధారణ) చేపట్టి ఆహూతులను ఆకట్టుకున్నారు. ఈ బృందానికి నేతృత్వం వహించి జాతీయస్థాయిలో ఉత్తమ టీమ్ లీడర్‌గా, కంటిజెంట్ లీడర్‌గా అవార్డులు అందుకున్న పీవో డాక్టర్ కె.కరుణా నిధిని వీసీ అభినందించారు. జాతీయ స్థాయిలో వర్సిటీకి పేరు ప్రతిష్ఠలు తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎం.అనూరాధ, డాక్టర్ సీహెచ్ రాజశేఖరరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అరుణకుమారి, పీవోలు టి.భవాని, బి.వ్యాసగీత పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నిర్మూలనపై సర్వే

గార, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలనలో భాగంగా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తున్నట్టు గార పీహెచ్‌సీ వైద్యాధికారి సోనియా అన్నారు. సోమవారం గారలో సర్వేను పరిశీలించి స్థానికులకు అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు ఉన్నట్టయితే అటువంటి వారికి పీహెచ్‌సీలో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తిస్తే నివారణకు అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.


ఇంటింటికీ వెళ్లి అవగాహన కలిగిస్తున్న వైద్యాధికారి సోనియా

న్యూస్ బాక్స్

బ్రహ్మోత్సవాలకు కళాకారులు

ఇచ్ఛాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు పట్టణానికి చెందిన వేంకటేశ్వర డ్యాన్స్ అకాడమీ చిన్నారులకు నృత్యప్రదర్శనకు అవకాశం లభించిందని అకాడమీ అధ్యక్షుడు చిన్నా గురుస్వామి తెలిపారు. ఈనెల 19 నుంచి 22 వరకు తిరుపతిలో జరగనున్న బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు 20మంది కళాకారులు పాల్గొంటున్నారన్నారు. 19న వాహన సేవ, 21న శిల్పారామం, 22న మహతి ఆడిటోరియంలో నృత్య ప్రదర్శనలు చేయనున్నారన్నారు. కృష్ణాజిల్లా కూచిపూడి గ్రామం నాట్య గురువులు ఏలేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనలు ఇస్తారని పేర్కొన్నారు.

8 మంది బైండోవర్

ఇచ్ఛాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బెల్ట్ దుకాణాలు లేకుండా ఉండేందుకు నిత్యం దాడులు నిర్వహిస్తున్నామని సీఐ పి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు వివిధ కేసుల్లో పట్టుబడిన 8 మందిని సోమవారం తహసీల్దార్ ఎన్.వెంకటరావు ఎదుట బైండోవర్ చేశామన్నారు. సారా తయారీ, విక్రయం, అనధికారికంగా మద్యం విక్రయాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఎక్కడైనా అక్రమ మద్యం, అధిక ధరలకు మద్యం అమ్మకాలు జరుగు తున్నట్లు సమాచారం తెలిస్తే 14405 టోల్‌ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వార పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని పేర్కొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

కవిటి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జగతి జడ్పీ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు పాండవ కిరణ్‌కుమార్ (45) సోమవారం మృతి చెందారు. ఈయన గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విధులు నిర్వహిస్తుండేవారు. కిరణ్‌కుమార్ ఆకస్మాత్తుగా మృతి చెందడంపై పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది సంతాపం తెలిపారు.

సందడిగా పుస్తక మహోత్సవం


పార్వతీపురం మన్యం జిల్లా గిరిజన బృందం సంప్రదాయ వాయిద్యాలు, థింసా ప్రదర్శన


వేడి నూనెలో చెయ్యి పెట్టి బజ్జీని తీయిస్తున్న జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు


కాకీ చొక్కా పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం


శిశుపాలుడి ఏకపాత్రాభినయం

శ్రీకాకుళం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సిక్కోలు పుస్తక మహోత్సవం సోమవారం సందడిగా సాగింది. స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఏడోరోజు వివిధ కార్యక్రమాలను చేపట్టారు. పలువురు పట్టణ వాసులు పుస్తకాలను పరిశీలించి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూఢ నమ్మకాలను పోగొట్టేలా పలు ప్రదర్శనలు చేపట్టారు. 'కాకీ చొక్కా' పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన గిరిజనుల బృందం థింసా నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శిశుపాలుడి ఏకపాత్రాభినయం అలరించింది. కార్యక్రమంలో పలువురు జేవీవీ, సీఐటీయూ ప్రతినిధులు, రచయితలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్ దాడి ఘటనలో నలుగురిపై కేసు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీపన్నాయుడుపేట జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తిపై జరిగిన దాడి ఘటనలో నలుగురు వ్యక్తులపై శ్రీకాకుళం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాగోలులో నివాసం ఉంటున్న సురేష్ కుమార్ అనే వ్యక్తి తన కుమారుడిని నగరంలో పీఎన్‌కాలనీలో ఉన్న ఓ ప్లేస్కూల్‌లో దించేందుకు వెళుతుండగా సీపన్నాయుడుపేటకు చెందిన సనపల రమేష్ ఎందుకు అంత వేగంగా వస్తున్నావని ప్రశ్నించాడు. మాటామాటా పెరగడంతో సీపన్నాయుడుపేటకు చెందిన సనపల రమేష్ మరో ముగ్గురి సాయంతో సురేష్ కుమార్‌పై దాడి చేశారు. బాధితుడు సురేష్ కుమార్ ఫిర్యాదు మేరకు సీఐ ఈశ్వరరావు సోమవారం సనపల రమేష్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

గ్రానైట్ క్వారీ కార్మికుడి మృతి


కర్రన్న మృతదేహం

మెళియాపుట్టి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పద్ద పంచాయతీ పరిధిలోగల అనిల్ కాంతి గ్రానైట్ క్వారీలో పనిచేస్తున్న జలగలింగుపురం గ్రామానికి చెందిన రాణ కర్రన్న(45) అనే కార్మికుడు సోమవారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు కర్రన్న గత ఆరు నెలలుగా క్వారీలో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం ఎప్పటిలాగానే విధులకు వెళ్లాడు. సాయంత్రం వాంతులు కావడంతో పాటు కళ్లు తిరగడంతో స్పృహ కోల్పోయాడు. దీంతో అక్కడి సిబ్బంది ఇంటి వద్దకు చేర్చారు. దీంతో కుటుంబ సభ్యులు మెళియాపుట్టి ఆరోగ్య కేంద్రాని తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా...మార్గమధ్యలో మృతి చెంది నట్లు ఎస్ఐ పిన్నింటి రమేష్‌బాబు తెలిపారు. కుటుంబ సభ్యులు మాత్రం కర్రన్న మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న ఆర్డీవో వెంకటేష్

పలాస రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని... అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో జి.వెంకటేష్ హెచ్చరించారు. పలాస రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం పీసీపీఎన్‌డీటీ సబ్ డిస్ట్రిక్ట్ మల్టీ లెవల్ అప్రోప్రియట్ అథారిటీ, అడ్వయిజరీ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లకు వచ్చే గర్భిణుల పేర్లు నమోదు చేసి... ప్రభుత్వానికి తెలియజేయాలని ఆదేశించారు. లేదంటే సంబంధిత స్కానింగ్ సెంటర్లపై చర్యలు చేపడతామన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలని... నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్టు నాగసుశీల, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ అధికారి శివరంజని, డెప్యూ డెమో ఎర్రన్న, పీసీపీఎన్‌డీటీ కోఆర్డినేటర్ మోనిమీ రత్నకుమారి, చైల్డ్‌లైన్ సభ్యురాలు బాలసరస్వతి పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే ముఖ్యం

ఎల్.ఎన్.పేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతులు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం ప్రగతి సాధిస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. టీకేపురం రైతుసేవా కేంద్రంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలను అమ్మేటప్పుడు రైతులను మోసం చేసేందుకు దళారీలు, వ్యాపారులు ఎదురు చూస్తుంటారని అన్నారు. వారి వల్ల రైతులు మోసపోకుండా ఉండేందుకు కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేయాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు. ఆయనతోపాటు తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ, ఎంపీడీవో పి. శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి కిరణ్‌వాణి, సర్పంచ్ ఎం. యోగీశ్వరి, బీఆర్ వంశధార ప్రాజెక్టు వైస్ చైర్మన్ వి.ఆనందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.మన్మథరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ కె.కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, తహసీల్దార్ జె.ఈశ్వరమ్మలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదేశించారు. వివిధ రకాల పనులపై సచివాలయాలకు వచ్చిన వారికి పలుమార్లు తిప్పుతున్నారని రైతులు ఆయన దృష్టికి తీసుకుచ్చారు. దీంతో సిబ్బంది పనితీరుపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు సిబ్బంది పనితీరు మార్చాలని ఎంపీడీవో శ్రీనివాసరావుకు ఆదేశించారు.

ఎక్కువ కేసుల రాజీకి యత్నించండి



మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి నిర్మల

టెక్కలి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 12న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల రాజీకి అందరూ సహకరించాలని సీనియర్ న్యాయాధికారి బి.నిర్మల అన్నారు. సోమవారం కోర్టు సముదాయం పరిధిలో న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజీకి అనుకూలమైన ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు న్యాయవాదులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పినకాన అజయ్ కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

రైతుల వివరాలు సరిచూసుకోండి


వివరాలను ప్రదర్శిస్తున్న ఏవో తదితరులు

నందిగాం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ-క్రాప్ నమోదు వివరాలు అందుబాటులో ఉంచామని, రైతులు సరిచూసుకోవాలని మండల వ్యవసా యాధికారి పి.శ్రీకాం త్వర్మ సూచించారు. సోమవారం రైతుసేవా కేంద్రాల్లో నమోదు వివరాలను ప్రదర్శించినట్లు చెప్పారు. తప్పులు ఉంటే సరిచేసుకోవాలని, దీనికోసం రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏలను కలిసి వివరాలు అందించాలన్నారు. దేవళభద్ర రైతు సేవా కేంద్రంలో వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మళ్ల బాలకృష్ణ తదితరులతో కలిసి ఇ-క్రాప్ నమోదు వివరాలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ కార్యాలయం సందర్శన

పలాసరూరల్, నవంబరు 17 ఆంధ్రజ్యోతి): పలాస పీఏసీఎస్ కార్యాలయాన్ని సోమవారం డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ సందర్శించారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ వంకల కూర్మారావు, సీఈవో శ్రీనివాసరావుతో వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ కార్యాలయ సిబ్బంది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నిర్లక్ష్యంతోనే రహదారి కష్టాలు: మంత్రి అచ్చెన్న


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి (సంతబొమ్మాళి), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రహదారులను పట్టించుకోకపోవడం వల్లనే రహదారులు దారుణంగా తయారయ్యాయని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం సాయంత్రం సంతబొమ్మాళి-కోటబొమ్మాళి రహదారి అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో నూతన రహదారులు నిర్మించకపోగా మరమ్మతులకు గురైన చోట్ల తట్టెడు మట్టి వేసిన దాఖలాలు లేవని విమర్శించారు. కూటమి ప్రభుత్వం పల్లెలకు పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రయత్నిస్తోం దన్నారు. అందులో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం గ్రామస్థులతో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కూచెట్టి కాంతారావు, నీటి సంఘం అధ్యక్షులు అల్లు రమేష్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు జీరు భీమారావు, మాజీ జడ్పీటీసీ బాడాన రవణమ్మ, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు అట్టాడ రాంప్రసాద్, నాయకులు మెండ అప్పారావు, సూరాడ ధనరాజు, పుక్కళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నవ్యాంధ్రకు నూతన శకం

విశాఖలో జరిగిన సీఐఐ సదస్సు ఏపీకి పెట్టుబడుల దిశను మార్చే చరిత్రాత్మక వేదికని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అభివర్ణించారు. సోమవారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఏపీని పెట్టుబడుల హబ్‌గా మార్చాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ చేపట్టిన వ్యూహాత్మక కృషికి ఈ సదస్సు నిదర్శనమని తెలిపారు. గత ఐదేళ్లలో విధ్వంసకర విధానాలతో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన ప్రధాన కంపెనీలు తిరిగి ఏపీ వైపు మళ్లుతున్నాయని మంత్రి గుర్తు చేశారు 613 ఒప్పందాల ద్వారా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు, 16 లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పనకు జరిగిన ఒప్పందాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై పెట్టుబడుదారుల విశ్వాసాన్ని చాటుతున్నాయని అన్నారు. సదస్సు మొదలు కాకముందే రూ.3.65 లక్షల కోట్ల కొత్త పెట్టుబడులు రావడం, 35 కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకోవడం రాష్ట్రంపై పెరుగుతున్న నమ్మకానికి నిదర్శమని పేర్కొన్నారు. పెట్టుబడులు ఒకే ప్రాంతంలో కేంద్రీకృతం కాకుండా రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రలలో సమానంగా విస్తరించేలా ప్రభుత్వం పని చేస్తోందని వెల్లడించారు.

మారుమూల గ్రామాలకూ రవాణా సౌకర్యం


బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాలకూ రవాణా సదుపాయాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. చినవంక పంచాయితీ గుల్లలపాడు గ్రామానికి సోమవారం ఆర్టీసీ బస్సు సర్వీసును ఆమె ప్రారంభించారు. బస్సులు లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను పీఏసీఎస్ మాజీ చైర్మన్ దువ్వాడ హేంబాబుచౌదరి తన దృష్టికి తెచ్చారని తెలిపారు. ఈమేరకు ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం జెండా ఊపి బస్సును ప్రారంభించారు. బస్సులో మహిళలు, నాయకులతో కలసి కొంతదూరం ప్రయాణిం చారు. ఈ కార్యక్రమంలో నాయకులు హేంబాబుచౌదరి, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు బుల్లోజు శశి భూషణ్, విఠల్, సూరాడ మోహనరావు, బగాది రాజారావు, నెయ్యిల సూర్య నారాయణ, పోతనపల్లి సాంబమూర్తి, ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే ధ్యేయం

రైతు శ్రేయస్సే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలం కేంద్రంలో రూ..28 లక్షల వ్యయంతో నిర్మించనున్న పీఏసీఎస్ అదనపు భవనానికి సోమవారం ఆమె భూమిపూజ చేసారు. పీఏసీఎస్ చైర్మన్ కణితి సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్య నారాయణ, సీఈఓ సత్యనారాయణ, తహసీల్దార్ సీతారామయ్య, ఎంపీడీవో ఎస్ .రమేష్‌నాయుడు, ఏవో బి.ధనుంజయరావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణం అవసరం


లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ విమల

జలుమూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అంగనవాడీ కేంద్రాలను ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఐ.విమల సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల మార్పు వల్ల పిల్లలు, గర్భిణులకు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని లబ్ధిదారులు ఇటీవల పీజీఆర్‌ఎస్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పెద్దదూగాం అంగనవాడీ కేంద్రాలను సోమవారం సాయంత్రం ఆమె పరిశీలించారు. లబ్ధిదారులకు కలుగుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల వద్ద ఒకే గదిలో మూడు కేంద్రాలు నిర్వహించడం, గ్రామం శివారు నుంచి అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లలు, గర్భిణులు వెళ్లడానికి అవస్థలు పడుతున్నట్లు వారు వివరించారు. దీనిపై స్పందించిన పీడీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. ఆమెతో పాటు సారవకోట ఎవో సీహెచ్. వంశీప్రియ, నోడల్ అధికారి మణెమ్మ, సూపర్‌వైజర్ మనోహరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రోడ్డు కోసం చంగుడి గ్రామస్థుల ఆందోళన

నాలుగు రోజుల్లో పునఃప్రారంభిస్తాం: ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న నాయకులు

పాతపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం నుంచి సరాళి మీదుగా మాకనాపల్లి కూడలి వరకూ బీటీ రోడ్డు పనులను నాలుగు రోజులలో పునః ప్రారంభిస్తామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆ ప్రాంతీయులకు హామీ ఇచ్చారు. పనులు కూడా త్వరగా పూర్తి చేస్తామన్నారు. వివరాల్లోకి వెళితే.. ఈ బీటీ రోడ్డును అసంపూర్తిగా వదిలేయడంపై చంగుడి గ్రామస్థులు సోమవారం ఆందోళనకు దిగారు. చంగుడి గ్రామంలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి..అసంపూర్తిగా వదిలేశారని ఆందోళన వ్యక్తం చేశారు. మెటల్ వేసి విడిచిపెట్టేశారని చెప్పారు. దీంతో వాహనాల రాకపోకలకు, పాదచారుల నడకకు కూడా వీలు పడని దుస్థితి ఏర్పడిందని వాపోయారు. తాము పండించే కూరగాయలను అమ్మేందుకు వెళ్లడానికి, విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు వెళ్లడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. ఆయన అందుబాటులో లేకపోవడం... పోలీసులు అడ్డుకోవడంతో తిరుగుముఖం పట్టారు. సాయంత్రం చంగుడి సర్పంచ్ ప్రతినిధి కోరాడ కాంతారావు, సరాళి సర్పంచ్ పడాల షణ్ముఖరావు, టీడీపీ నేతలు నందిగామ ఆనందరావు, బమ్మిడి నరసింహమూర్తి, రోకళ్ల శివాజీ తదితరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావును కలిశారు. సమస్యను వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. నాలుగు రోజులలో పనులు పునఃప్రారంభమయ్యేలా చర్యలు తీసుకొంటానని భరోసా ఇచ్చారు. చంగుడిలో అసంపూర్తిగా నిలిచిన పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల నూతన భవన నిర్మాణాలు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయనను వారు కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో వారు వెనుదిరిగారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, అర్చన

నరసన్నపేట/పోలాకి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి సాధించేలా చూడడం... యువతకు ఉద్యోగాలు అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా సీఎం నారా చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సదస్సు సూపర్ హిట్ అవ్వడమే దీనికి తార్కాణమని చెప్పారు. ఈ మేరకు సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ.13.25 లక్షల కోట్లకు పైగా విలువైన ఒప్పందాలు కుదిరాయన్నారు. ఈ సమావేశంలో నియోజవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


నృత్యం చేస్తున్న మహిళలు

కాశీబుగ్గ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం మహిళలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సత్యసాయి బాబా శత జయంతి వేడుకల సందర్భంగా వారం రోజుల పాటు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మందిరం సభ్యులు జగ్గప్ప, నాగరాజు, నారాయణ, దొర తెలిపారు. 23న బాబా పుట్టినరోజు సందర్భంగా పల్లకి ఉత్సవాలు, అన్నప్రసాదం పంపిణీ, ఊయల సేవ నిర్వహిస్తామని చెప్పారు.

సాయి శతజయంతి వేడుకలు

హరిపురం, నవంబరు 17 ఆంధ్రజ్యోతి): మందస మండల కేంద్రంతోపాటు కొండలోగాం పంచాయితీ కొయ్యాడూరులో సోమవారం భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయినామ స్మరణ, ప్రత్యేక గీతాలాపనతో భజనలు చేపట్టారు. అనంతరం రుద్రాభిషేకం చేశారు. ఈ నెల 23 వరకు వేడుకలు నిర్వహించనున్నట్లు మందస బృందావన సత్యసాయి సేవాసమితి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కార్మికుల బకాయిలు చెల్లించాలి



ఆందోళన చేస్తున్న గ్రానైట్ కార్మికులు

టెక్కలి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రావివలసలోని ఎంటర్ ప్రైజెస్ అండ్ ఎంటర్‌ప్రైజింగ్ గ్రానైట్ కార్మికుల జీతాల బకాయిలు చెల్లించాలని జిల్లా గ్రానైట్ మైన్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు నంబూరు షణ్ముఖరావు అన్నారు. సోమవారం సీఐటీయూ కార్యాలయం వద్ద గ్రానైట్ కార్మికులు ఆందోళన వెలిబుచ్చారు. ఆ కంపెనీలో పనిచేసిన సిబ్బందికి బకాయిలు చెల్లించాల్సి ఉన్నా యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఇప్పటికే కేంద్ర లేబర్ అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. తక్షణమే కార్మికుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బైరాగి, సూర్యనారాయణ, వెంకట్రావు, నాగేసు, నర్సింహులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మున్సిపల్ కమిషనర్


మంత్రి అచ్చెన్నాయుడుకు పూల మొక్కను అందిస్తున్న కమిషనర్

పలాస, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఇ.శ్రీనివాసులు సోమవారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషలను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గుంటూరు జిల్లా నుంచి పదోన్నతిపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

సేంద్రియ ఉత్పత్తులకు ఆదరణ


స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

హరిపురం, నవంబరు 17 ఆంధ్రజ్యోతి): మహిళా రైతులు సేంద్రియ ఎరువులుతో పండిస్తున్న పంటలకు వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని ఏపీఎం పి.కూర్మారావు అన్నారు. మందస మండల కార్యాలయ ఆవరణలో సోమవారం సేంద్రియ ఎరువులతో పండించిన ఉత్పత్తులతో స్టాల్‌ను ప్రారంభించారు. టమాట, వంకాయలు, ఆకుకూరలు, పూలు, పండ్లు విక్రయించారు. ఈ కార్యక్రమంలో వెలుగు, మండల కార్యాలయ సిబ్బంది, మహిళా రైతులు పాల్గొన్నారు.

మల్లేశ్వరుని దర్శించుకున్న సహాయ కమిషనర్

కోటబొమ్మాళి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల మల్లేశ్వర స్వామిని దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ బిఆర్‌.వి.వి.ప్రసాద్ పట్నాయక్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో రాధాకృష్ణ ఆయనకు స్వాగతం పలికారు. అర్చకులు ఆయనకు ఆలయ విశిష్టతను వివరించారు.

ఉచిత వైద్య పరీక్షలు

పలాస, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో సోమవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఖాతాదారులు, ఉద్యోగులకు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలను శ్రీకాకుళం మెడికవర్ ఆసుపత్రి వైద్యసిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్‌మేనేజర్ అర్జునరావు, క్లస్టర్ సేల్స్‌మేనేజర్ ఆర్.వెంకటగిరిరాజు, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్లు ఎ.సునీల్ కుమార్, కె.సతీష్ కుమార్, డాక్టర్ పి.అశోక్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై రేపు అవగాహన

మెళియాపుట్టి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధిపై యువతకు అవగాహన కల్పించనున్నట్టు ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న సీతంపేట పీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో దీనిపై సదస్సు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల గిరిజనులకు రుణాలు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

కొత్తూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలను ప్రయివేటీకరించే యోచన ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి డిమాండ్ చేశారు. సోమవారం కొత్తూరు మండలం కంఠమానుగూడ గిరిజన గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు ఎంపీపీ సవర సావిత్రి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై సర్వే

పోలాకి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి రాకుండా నివారించేందుకు, సోకిన వారిని గుర్తించి వైద్యం అందించేందుకు వీలుగా గ్రామాలో సర్వే నిర్వహిస్తున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనాథ్, విస్తరణాధికారి నల్లి రవికుమార్ తెలిపారు. సోమవారం ఈ సర్వేని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

మందస, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మందస సత్యసాయి బృందావన్‌లో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి వైద్యులతో ఈ శిబిరంలో పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

వ్యాసరచన పోటీలు

మందస, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మందస శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారులు మాట్లాడుతూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వీఆర్‌కు ఎస్ఐ దుర్గాప్రసాద్

నరసన్నపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):నరసన్నపేట ఎస్ఐగా పనిచేస్తున్న సీహెచ్ దుర్గాప్రసాద్‌ను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ మహేశ్వరరెడ్డి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జిల్లాలో కొందరు ఎస్ఐలకు ఇతర పోలీసు స్టేషన్లకు అటాచ్ చేయగా.. నరసన్నపేట ఎస్ఐ దుర్గాప్రసాద్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు.

సమాజ నిర్మాణంలో యువతే కీలకం

నరసన్నపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ సమాజ నిర్మాణంలో యువత ప్రధాన భూమిక పోషించాల్సిన అవసరం ఉందని ఎంఈవో పి.దాలినాయుడు సూచించారు. సోమవారం స్థానిక ఇందిరానగర్‌లో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పీవో కె.రాములు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలే లక్ష్యం

నరసన్నపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యంగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు పనిచేస్తుందని ఆర్ఎం రవికుమార్ గుప్త అన్నారు. సోమవారం నరసన్నపేటలో బ్యాంకు నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఎం జి.పద్మిని, రైస్ మిల్లర్ల సంఘ నాయకులు ఉన్నా భార్గవ్, తంగు శ్రీధర్, దుంగ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.